సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



సైబర్ కేటుగాళ్లతో జాగ్రత్త

ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరస్తులు రోజుకో కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నారు.

- 8లో ▸





వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేలా కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయ్స్ డీఎం జగదీశ్, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్ తదితరులున్నారు.

డీఐఈవోగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా ఇంటర్ విద్యాధికారిగా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన రఘురాజ్ పదవీ విరమణ చేయడంతో రవికుమార్‌ను డీఐఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో ప్రిన్సిపాళ్లు, ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో లెక్చరర్లు సన్మానం చేశారు.


హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

నిజామాబాద్‌అర్బన్‌: మోడల్ స్కూళ్లలో 6, 7, 10 తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న అర్హత పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న జిల్లాలోని 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9391266444 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రెండు చోట్లా త్రిముఖ పోరు

- నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ బరిలో పోటాపోటీ
- గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహాలు
- మోదీ చరిష్మాతో ఉత్సాహంగా దూసుకెళ్తున్న బీజేపీ
- 'ముక్కోణం'లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నాలు

పార్లమెంట్ ఎన్నికల ఫీవర్ మొదలైంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాలకు మూడు ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. టికెట్ల కేటాయింపు, ప్రత్యర్థులెవరో తేలిపోవడంతో ఆయా పార్టీలు క్షేత్రస్థాయి కార్యాచరణ వేగవంతం చేశాయి. అభ్యర్థులు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసుకోవడంతో పాటు ప్రత్యర్థుల బలాలు, బలహీనతలపై కచ్చితమైన అంచనాలు వేసుకుంటూ ఎత్తులు, పైఎత్తులు వేసేందుకు వ్యూహాలు, ప్రతివ్యూహాలు పన్నుతున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ రెండు ఎంపీ స్థానాలను ఎట్టిపరిస్థితుల్లో గెలుచుకునేందుకు పట్టుదలగా ఉంది. పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలోని 14 సెగ్మెంట్లలో, ఆయా సెగ్మెంట్ల వారీగా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకెళుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో పాటు ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్న నేపథ్యంలో తమ పార్టీకి అడ్వాంటేజ్‌గా ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

నిజామాబాద్ స్థానం నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి గెలుపు కోసం శ్రేణులను సిద్ధం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ రెండు ఎమ్మెల్యే సీట్లను(బోధన్, నిజామాబాద్ రూరల్) మాత్రమే గెలుచుకున్నప్పటికీ 4,08,135 ఓట్లను సాధించింది. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా సన్నాహాలు చేసుకుంటున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో మాత్రం కాంగ్రెస్ ఏకంగా నాలుగు ఎమ్మెల్యే సీట్లు (నారాయణ్‌ఖేడ్, ఆందోల్, జుక్కల్, ఎల్లారెడ్డి) గెలుచుకుంది. అత్యధికంగా 5,49,143 ఓట్లు దక్కించుకుంది. దీంతో పార్టీ అభ్యర్థి అయిన సీనియర్ నేత, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ విజయం కోసం పక్కా స్కెచ్ వేసుకుని ముందుకెళుతున్నారు.

■ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బీసీ మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్‌కుమార్‌లను బరిలోకి దించింది. వీరిద్దరూ సీనియర్ నాయకులే కావడం కలిసొచ్చే అంశం. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మూడు ఎమ్మెల్యే (జగిత్యాల, కోర్టుట్ల, బాల్కొండ) సీట్లను గెలుచుకుంది. ఓట్లు 4,17,315 సాధించింది. బాజిరెడ్డి గోవర్ధన్‌కు గల మాస్ ఇమేజ్ అనుకూలిస్తుందని పార్టీ భావిస్తోంది. మూడు పార్టీల పోటాపోటీలో తమకు ఫలితం దక్కుతుందని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆశాభావంతో ఉన్నారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో బీఆర్‌ఎస్ రెండు ఎమ్మెల్యే (బాన్సువాడ, జహీరాబాద్) సీట్లను గెలుచుకుంది. 5,30,499 ఓట్లు సాధించింది. మంచి ఇమేజ్ కలిగి ఉన్న గాలి అనిల్‌కుమార్‌పై ప్రజల్లో సానుకూలత ఉందని బీఆర్‌ఎస్ కార్యకర్తలు అంటున్నారు. గట్టి ముక్కోణపు పోటీలో తమకు లాభం ఉంటుందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

■ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లను గెలుచుకునే లక్ష్యంతో కసిగా పనిచేస్తోంది. కాంగ్రెస్‌తో నువ్వానేనా అనే రీతిలో పోరు చేసేందుకు సిద్ధమైంది. నిజామాబాద్ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గెలుపుపై ధీమాతో ఇప్పటికే ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొదటి దశ ప్రచారం పూర్తి చేశారు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో బీజేపీ రెండు ఎమ్మెల్యే సీట్లను (నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్) గెలుచుకుంది. పైగా 3,65,374 ఓట్లను సాధించింది. ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాతో మరింత భారీగా ఓటింగ్ దక్కనుందనే ధీమాతో అర్వింద్ ఉన్నారు. అదేవిధంగా పసుపు బోర్డు మంజూరును సైతం ప్రధానమంత్రి ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లో గెలవాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ తన అభ్యర్థిగా బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌ను బరిలోకి దించింది. ఇక్కడ బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికల్లో 1,72,766 ఓట్లు మాత్రమే సాధించింది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో బీజేపీ ఒక్క కామారెడ్డి ఎమ్మెల్యేను మాత్రమే గెలుచుకుంది. అయితే ఈ గెలుపు మాత్రం దేశంలోనే ప్రత్యేకంగా నిలిచింది. ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థులైన రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లను వెంకటరమణారెడ్డి ఓడించడంతో ఈ గెలుపునకు విలువ ఎక్కువ ఉంది. ప్రధాని మోదీ నామస్మరణ జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో బాగా ఉండడంతో గెలుపునకు దోహదం చేస్తుందని బీబీ పాటిల్, పార్టీ శ్రేణులు ఆశాభావంతో ఉన్నాయి. ఇక్కడ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రభావం పార్లమెంట్ వ్యాప్తంగా ఉండడంతో బీజేపీకి అదనపు బలం ఉన్నట్లేననే చర్చ నడుస్తోంది.

చివరికి తిప్పలేనా..!



నీరులేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ

- నేటి నుంచి కాకతీయ కాలువ ఆయకట్టుకు నీరు నిలిపివేత
- ఇంకా చేతికి రాని పంట
- ఒక్క తడి ఇవ్వాలంటున్న ఆయకట్టు రైతులు
- సాధ్యం కాదంటున్న అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సరిపడా నీరు లేకపోవడంతో చి'వరి'కి నీటితిప్పలు తప్పేలా లేవు. కాకతీయ కాలువ ద్వారా మంగళవారం నుంచి నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులు నిలిపివేయనున్నారు. ఆయకట్టుకు నీటి విడుదల ప్రణాళిక ముగిసినట్లు పేర్కొన్నారు. కానీ కాకతీయ కాలువ నీటి ఆధారంగా సాగవుతున్న వరి పంటలు మాత్రం ఇంకా కోతకు రాలేదు. కనీసం ఏప్రిల్ 10 వరకు మరోతడి నీరందిస్తే పంటలు చేతికందుతాయని ఆయకట్టు రైతులు అంటున్నారు. కానీ చుక్క నీటిని కూడా వదిలే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. చివరికి నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

డిసెంబర్ 16 నుంచి నీటి విడుదల

ప్రాజెక్టు నుంచి గత డిసెంబర్ 16వ తేదీ నుంచి నీటివిడుదలను చేపట్టారు. వారబందీ ప్రకారం వారం రోజులు 3,500 క్యూక్కులు, ఎనిమిది రోజులు 7,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. యాసంగి సీజన్‌కు సంబంధించి నీటి విడుదల ప్రారంభమైన సమయంలో ప్రాజెక్టులో 78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటినిల్వ 13 టీఎంసీలకు పడిపోయింది.

తాగునీటికి ప్రాధాన్యత

ప్రాజెక్టులో ప్రస్తుతం 13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కానీ అందులో 5 టీఎంసీల డెడ్ స్టోరేజీ, 5 టీఎంసీలు తాగునీటి అవసరాలకు పోతుంది. ఆవిరి రూపంలో 2 టీఎంసీలు పోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ ఇంకా ముంపు గ్రామాల ఎత్తిపోతలకు, లక్ష్మి, సరస్వతి కాల్వల ఆయకట్టుకు నీటి సరఫరా చేపట్టాల్సి ఉంది. వాటికి ఒక టీఎంసీ నీరు అవసరమవుతుంది. కాగా, ప్రాజెక్టులో 12 టీఎంసీల నీరు కచ్చితంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు భావిస్తున్నారు. దీంతో కాకతీయ కాలువ ద్వారా మరోతడి ఇచ్చే అవకాశం లేదని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. నీటి సరఫరా లేకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

శ్రీరాంసాగర్ నుంచి కాల్వల ద్వారా నీటివిడుదల కొనసాగుతుండడంతో నీటిమట్టం తగ్గుతోంది. కాకతీయ కాలువ ద్వారా 7వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 314 క్యూసె క్కుల నీరు పోతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1059.80 అడుగుల(13 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

తాగునీటి అవసరాలు ముఖ్యం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ తక్కువగా ఉన్న దృష్ట్యా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వపై ఉన్నతాధికారులకు ఇది వరకే నివేదించాం. ఆయకట్టుకు మరోతడి నీరివ్వడం సాధ్యం కాదు. – చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

మొండి బకాయిల వసూళ్లకు స్పెషల్ రికవరీ సెల్

- డీసీసీబీ సీఈవో నాగభూషణం వందే

సుభాష్‌నగర్: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మొండి బకాయిల వసూలుకు స్పెషల్ రికవరీ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు డీసీసీబీ సీఈవో నాగభూషణం వందే సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చిన ఏజీఎం భూపాల్‌రెడ్డి ఇన్‌చార్జీగా నియమించామని, ఆయనతోపాటు రికవరీ, లీగల్ అంశాల్లో అనుభవజ్ఞులైన అధికారులు సెల్‌లో ఉంటారన్నారు. మొండి బకాయిల విషయంలో బ్యాంకు అధికారులు ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. రైతులు కూడా సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకింగ్ సేవలు పొందాలని, బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రికవరీ సెల్‌ను ఏర్పాటు చేస్తూ డీసీసీబీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రుణాలు చెల్లించని రుణగ్రస్తులపై తగిన చర్యలు తీసుకుంటామని సీఈవో పేర్కొన్నారు. కాగా డీసీసీబీలో రూ. 150 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నట్లు తెలిసింది. దాదాపు రెండేళ్లుగా సొసైటీ చైర్మన్ల విజ్ఞప్తి మేరకు రైతుల సౌకర్యార్థం బకాయిలు చెల్లించేందుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను డీసీసీబీ పాలకవర్గం అవకాశం కల్పించింది.

నిజాంసాగర్ ప్రధాన కాలువకు గండి



గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్





ఆర్మూర్‌లోని జర్నలిస్టు కాలనీలో రోడ్డుపై పారుతున్న నీరు, నిజాంసాగర్ కెనాల్‌కు గండి

- ఇళ్లలోకి చేరిన నీరు
- నేలకొరిగిన విద్యుత్‌స్తంభం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ సమీపంలో గల నిజాంసాగర్ ప్రధాన కాలువకు గండిపడింది. సోమవారం వేకువజామున గండి పడడంతో నీళ్లు ఇళ్లలోకి చేరింది. అలాగే ఒక విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు అవస్థలు పడ్డారు. గండిపడిన కాలువను జెడ్పీచైర్మన్ విఠల్‌రావు ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్‌తో మాట్లాడి నష్టపోయిన వారిని ఆదుకోవాలని కోరారు. ఇరిగేషన్, మున్సిపల్, ట్రాన్స్‌కో అధికారులు యుద్ధప్రాతిపదకన కాలువకు మరమ్మతులు చేశారు.

కాలువలో అక్రమ అడ్డుకట్టలతోనేనా..

నిజాంసాగర్ ప్రధాన కాలువ నుంచి పెర్కిట్ చెరువు వరకు పిల్ల కాలువలో అక్రమ అడ్డు కట్టల కారణంగా ప్రధాన కాలువకు గండిపడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్ల కాలువ కట్టలతో మూసుకుపోవడం వల్ల ప్రధాన కాలువ వద్ద నీటి ఉధృతి పెరిగి కోతకు గురైందని చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే కాల్వలు ఆక్రమణలకు గురువుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలువ నుంచి పెర్కిట్ చెరువు వరకు గల పిల్ల కాలువపై నిర్మించిన అక్రమ కట్టలను తొలగించినప్పుడే కోతకు గురికాకుండా అరికట్టగలమని స్థానికులు చెబుతున్నారు.

అధికారీ.. ఇదేం పని!

- పంచాయతీ ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలింపు
- ఫిర్యాదు చేసిన దత్తాపూర్ పంచాయతీ కార్యదర్శి
- స్పెషల్ ఆఫీసర్‌పై విచారణకు ఆదేశించిన డీపీవో



ఇసుక ట్రాక్టర్‌ను ఎవరూ ఆపకుండా ఫాలో అవుతున్న ప్రత్యేకాధికారి వాహనం

దొంకేశ్వర్(ఆర్మూర్): నిబంధనలు పాటించాలని ప్రజలకు చెప్పాల్సిన అధికారే అక్రమ ఇసుక రవాణాకు పాల్పడ్డాడు. అది కూడా గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో తరలించడంపై జిల్లా పంచాయతీ అధికారి సీరియస్ అయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. డొంకేశ్వర్ మండల పశువైద్య అధికారిగా కొనసాగుతున్న హన్మంత్ రెడ్డి దత్తాపూర్, మారంపల్లి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్నారు. కాగా కొన్ని నెలలుగా ఆయన వ్యవహార శైలి వివాదాస్పదంగా ఉందని ఆరోపణలున్నాయి. పంచాయతీ కార్యదర్శులను వేధింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా పక్షం రోజుల కిందట హన్మంత్ రెడ్డి దత్తాపూర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను పంచాయతీ కార్యదర్శికి సమాచారం లేకుండా తీసుకెళ్లాడు. కారోబార్, డ్రైవర్‌ను బలవంతపెట్టి ట్రాక్టర్‌ను తీసుకెళ్లి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను నిజామాబాద్‌కు తరలించాడు. అది కూడా అక్రమంగా జీపీ నిధులతో ట్రాక్టర్‌లో డీజిల్ పోయించుకున్నాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సుప్రియ ఇటీవల ఎంపీడీవో శ్రీనివాస్ రావుకు ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా ప్రత్యేక అధికారి ట్రాక్టర్‌ను తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఇదే నివేదికను ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణకు కూడా ఇచ్చారు. అధికారులు జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విచారణకు ఆదేశించారు. అధికారి ఆదేశాల మేరకు డీఎల్‌పీవో ఈ నెల 3న విచారణకు హాజరు కావాలని దత్తాపూర్‌కు ప్రత్యేక అధికారిగా ఉన్న హన్మంత్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. హన్మంత్ రెడ్డితో పాటు ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి కూడా హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.

తప్పించుకోడానికి బెదిరింపులు!

అక్రమంగా పంచాయతీ ట్రాక్టర్‌లో ఇసుక తరలింపుపై విచారణ నేపథ్యంలో.. విచారణ సమయంలో అధికారులకు తన పేరు చెప్పవద్దని ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్‌లపై ఆరోపణలు ఎదుర్కొంటున్న హన్మంత్ రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అలాగే విచారణలో తాను దొరక్కుండా పంచాయతీ ట్రాక్టర్‌లో తరలించిన ఇసుకను వేరే గ్రామ పంచాయతీ వద్ద పోసినట్లు జీపీలో తప్పుడు రసీదును కూడా సిద్ధం చేసి పెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నోటీసులు ఇచ్చాం..

గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో నిబంధనలకు విరుద్ధంగా తన ఇంటికి ఇసుక తరలింపుపై దత్తాపూర్ జీపీకి ప్రత్యేక అధికారిగా ఉన్న హన్మంత్ రెడ్డిని విచారణకు హాజరు కావాలని డీఎల్‌పీవో నోటీసులు ఇచ్చారు. ఈ నెల 3న పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపడుతాం.

– శ్రీనివాస్ రావు, ఎంపీడీవో

పోస్టల్ బ్యాలెట్‌కు ఫారం-12(డి) సమర్పించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 20వ తేదీలోపు ఫారం-12(డి)ని నోడల్ అధికారుల ద్వారా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం వివిధ శాఖల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీలోపు ఫారాలను సమర్పిస్తేనే పరిగణనలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆర్‌వో కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నోడల్ అధికారి విజయేందర్ రెడ్డి, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గం	ఆర్‌వో కార్యాలయం
నిజామాబాద్ అర్బన్	నగర పాలక సంస్థ
నిజామాబాద్ రూరల్	నిజామాబాద్ ఆర్డీవో
బాన్సువాడ	బాన్సువాడ ఆర్డీవో
బోధన్	బోధన్ ఆర్డీవో
ఆర్మూర్	ఆర్మూర్ ఆర్డీవో
బాల్కొండ	భీమ్‌గల్ ఎంపీడీవో

ఇంటి నుంచి ఓటు హక్కుకు..

పార్లమెంట్ ఎన్నికల్లో 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలు గా ఫారం 12-డిలను పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 ఏళ్లుపైబడిన ఓటర్లు 7,555 మంది ఉండగా, మార్చి 30నాటికే 3,331 మందికి, దివ్యాంగ ఓటర్లు 24,229 మందికి గాను 10,175 మందికి ఫారాలను సమకూర్చామన్నారు. ఇంటి నుంచి ఓటు వేయాలనుకునే వారు ఈనెల 20వ తేదీ వరకు ఫారాన్ని అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. తర్వాత పోలింగ్ అధికారుల బృందాలు వారి ఇళ్లకు వెళ్లి పారదర్శకంగా ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తాయని చెప్పారు.

పుత్తడి ధర పైపైకి..

- 10 గ్రాముల వెల రూ.70 వేలు
- కొనుగోలుదారుల్లో ఆందోళన

సాక్షి, కామారెడ్డి: పసిడి పరుగులు ఆగడం లేదు. ధర రోజురోజుకు రికార్డులు సృష్టిస్తూ ముందుకు సాగుతోంది. సోమవారం మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాముల ధర రూ.70 వేలు పలికింది. ఇది ఆల్ టైం రికార్డు అని బులియన్ వ్యాపారులు పేర్కొంటున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం ధర అడ్డగోలుగా పెరుగుతుండడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. బంగారం కొనలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరల ప్రభావం కొనుగోళ్లపై పడొచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో ఆభరణాల తయారీపై ఆధారపడ్డ స్వర్ణకారుల ఉపాధికి ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి.

75 ఏళ్లలో బంగారం ధరల వివరాలు ఇలా..

సంవత్సరం	బంగారం ధర (10గ్రాములకు రూ.లలో)
1950	99.18
1960	111.87
1970	184.50
1980	1,330.00
1990	3,200.00
2000	4,400.00
2010	18,500.00
2020	48,650.00
2021	50,045.00
2022	52,950.00
2023	64,300.00
2024	70,000.00



క్లుప్తంగా

వెయిట్‌ లిఫ్టింగ్‌లో ప్రతిభ



వెంకట్‌

పెర్కిట్‌: ఆర్మూర్‌ మున్సిప ల్‌ పరిధిలోని మామిడిపల్లి కి చెందిన జెస్సు వెంకట్‌ జాతీయ స్థాయి వెయిట్‌ లి ఫ్టింగ్‌ పోటీల్లో కాంస్య ప తకం సాధించాడు. ఢిల్లీ లో ఆదివారం పవర్‌ లి ఫ్టింగ్‌ కాంగ్రెస్‌ ఆధ్వ ర్యంలో ని ర్వహించిన పోటీల్లో వెంకట్‌ 90 కిలోల విభాగంలో ప్రతి భతో కాంస్య పతకం సాధించాడు.

4న క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్‌ టౌన్‌: ఆర్మూర్‌ డిగ్రీ కాలేజీ మైదానం లో ఈ నెల 4న రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకా రుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా రూరల్‌ గే మ్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అశోక్‌ గౌడ్‌ ఒక ప్రకటన తెలిపారు. బాలుర ఖోఖో, కబడ్డీ, వా లీబాల్‌, ఫుట్‌బాల్‌, బ్యాడ్మింటన్‌, బాస్కెట్‌ బా ల్‌, క్రికెట్‌,చెస్‌, యోగా, తైక్వాండో, కరాటే క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు. ఉమ్మడి జిల్లా నుంచి ఆసక్తి గల క్రీడాకా రులు పాల్గొనాలని సూచించారు. వివరాలకు 9014581059 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మౌలిక వసతులపై సర్వే



దోమకొండ : మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ సౌత్‌ క్యాంపస్‌ విద్యాలయం, దోమకొండ గడికోట ట్రస్ట్‌ ఆధ్వర్యంలో గ్రామంలో మౌలిక వసతులపై సంయుక్త సర్వే చేపట్టారు. తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంతో గడికోట ట్రస్ట్‌ చేసిన ఒప్పందం మేరకు విలేజ్‌ డిజిటలైజేషన్‌లో భాగంగా సం యుక్తంగా అన్ని వార్డుల్లో కలిపి మ్యాప్‌ తయారు చేసి సర్వే చేసినట్లు వారు వివరిం చారు. గ్రామానికి సంబంధించి ప్రభుత్వ సం స్థలు, ప్రైవేట సంస్థలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మా ణాలు, మౌలిక సదుపాయాలు, కుటుంబ వివ రాలతో ప్రణాళిక తయారు చేయనున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో సౌత్‌ క్యాంపస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ సుధాకర్‌గౌడ్‌, పోర్ట్‌ ట్రస్ట్‌ ప్రతినిధి గణేష్‌, అధ్యాపకులు డాక్టర్‌ ప్రతిజ్ఞ, డాక్టర్‌ యాలాద్రి, ఎస్‌ నారాయణ, జియో ఇన్ఫర్మేషన్‌ విద్యార్థులు ఉన్నారు.

ట్రస్మా నూతన కమిటీ ఎన్నిక



నిజామాబాద్‌అర్బన్‌: ట్రస్మా జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా రాస నిత్యానందం, సెక్రెటరీగా గోజూరి అరుణ్‌, ట్రెజరర్‌గా ఉప్పల మధు, స్టేట్‌ అసోసియేట్‌ ప్రెసిడెంట్‌గా క్రాంతి గంగారెడ్డి, జాయింట్‌ సెక్రెటరీగా పండ్ల రమేష్‌, పట్టణా ధ్యక్షుడు ధర్మరాజు, కార్యవర్గ సభ్యులుగా హరీశ్‌, శ్రీనివాస్‌, నబి, భార్గవ చైతన్య, కోదం డరామయ్య, నాగేష్‌, గోపికష్ణ, రమేష్‌, దేవన్న, సన్నీ, హన్మండ్లు, నాగరాజ్‌, శ్రీనివాస్‌, మల్లయ్య, సత్యనారాయణ, నారగౌడ్‌, ప్రవీణ్‌ పవర్‌, లింగారెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గ సభ్యులు రాష్ట్ర స్పోక్స్‌ పర్సన్‌ జయసింహాగౌడ్‌ ఆధ్వర్యంలో కలెక్టర్‌, డీఈ వోను మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుపయోగంగా ఉన్న ఫిజికల్‌ హ్యాండీ క్యాఫ్డ్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ భవనాన్ని ట్రస్మాకు కేటా యించాలని కోరారు.

ఉచిత ఇసుకకు మార్గదర్శకాలు

- స్థానిక అవసరాలకు జిల్లాలో 17 పాయింట్‌ల నుంచి అనుమతి
- ట్రాక్టర్‌లను తహసీల్‌ కార్యాలయంలో నమోదు చేయించాల్సిందే..
- నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలు



సుంకెట్‌ పెద్దవాగులో ఇసుకను తవ్వుతున్న కూలీలు

మోర్తాడ్‌: ఇసుకను స్థానిక అవసరాల కోసం ఉచి తంగా తరలించుకోవడానికి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం ఇందుకోసం విధి విధానాలను రూపొం దించింది. జిల్లా యూనిట్‌గా నిర్దేశించిన పాయిం ట్‌ల నుంచి ఇసుకను గృహ నిర్మాణాల కోసం ఉచి తంగానే తరలించుకోవడానికి వెసులుబాటును కల్పించారు. స్థానిక అవసరాల కోసం సీనరేజ్‌ చార్జీలను చెల్లించకుండా ఇసుకను తరలించడానికి ఆమోదం తెలిపిన ప్రభుత్వం రెండు రోజుల కింద మార్గదర్శకాలను జారీ చేసింది. ఇసుకను తరలించే వాహనాలను ఆయా మండలాల తహసీల్దార్‌ కార్యాలయాల్లో నమోదు చేసుకోవాల్సి ఉంది. అధికారుల వద్ద రిజిస్టర్‌ చేసిన వాహనాల్లోనే ఇసు కను నిర్దేశించిన పాయింట్‌ల నుంచి ఉచితంగా తర లించడానికి వీలు ఉంది. గతంలో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కో ట్రాక్టర్‌ లోడ్‌కు రూ.900 సీనరేజ్‌ చార్జీలు ప్రభుత్వానికి చెల్లించేవారు. ఇప్పుడు ఎలాంటి సీనరేజ్‌ చార్జీలను చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఇసుకను తవ్వి తీసుకవెళ్లడానికి అనుమతి జారీ చేయనున్నారు. గతంలో కొన్ని పాయింట్‌ల నుంచి ఆయా మండలాల గ్రామాలకే ఇసుకను తరలించేవారు. ఉచిత ఇసుకను జిల్లాలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తరలించే అనుమతి కల్పించారు. ఆయా పంచాయతీల కార్యదర్శుల అజమాయిషీలో ఇసుక తరలించడానికి ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.

జిల్లాలో గుర్తించిన ఇసుక పాయింట్‌లు

మండలం	గ్రామం	వాగు
భీమ్‌గల్‌	గోనుగొప్పుల	కప్పల వాగు
వేల్పూర్‌	కోమన్‌పల్లి	పెద్ద వాగు
వేల్పూర్‌	వెంకటాపూర్‌	పెద్ద వాగు
వేల్పూర్‌	వేల్పూర్‌	పెద్ద వాగు
మోర్తాడ్‌	సుంకెట్‌	పెద్ద వాగు
మోర్తాడ్‌	ధర్మోరా,పాలెం	పెద్ద వాగు
మోర్తాడ్‌	శెట్‌పల్లి	పెద్ద వాగు
బోధన్‌	పెగడపల్లి	పసుపు వాగు
నవీపేట్‌	లింగాపూర్‌	పూలాంగ్‌ వాగు
సిరికొండ	పెద్దవాల్గోట్‌	కప్పల వాగు
సిరికొండ	కొండూర్‌	కప్పల వాగు
సిరికొండ	తాళ్లరామడుగు	కప్పల వాగు
సిరికొండ	చిన్నవాల్గోట్‌	కప్పల వాగు
సిరికొండ	గడ్కోల్‌	కప్పల వాగు
జక్రాన్‌పల్లి	కొలిప్యాక్‌	పెద్ద వాగు
డిచ్‌పల్లి	సుద్దులం	పెద్ద వాగు
ఏర్గట్ల	తొర్తి	పెద్ద వాగు

ఎన్నికల తర్వాత అమలయ్యే అవకాశం

ఉచితంగా స్థానిక అవసరాల కోసం ఇసుకను తర లించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. పార్లమెంట్‌ ఎన్నికలు ముగిసిన తర్వాతే ఉచితంగా ఇసుకను తరలించుకోవడానికి వీలు అయ్యే అవకాశం ఉంది. ట్రాక్టర్లను మొదట రిజిస్టర్‌ చేయించుకోవాలి. రిజిస్టర్‌ చేసుకున్న ట్రాక్టర్‌లలోనే ఇసుక రవాణా చేయడానికి అనుమతి ఇస్తారు.

– సత్యనారాయణ, తహసీల్దార్‌, మోర్తాడ్‌

సైబర్‌ కేటుగాళ్లతో జాగ్రత్త

- ఎన్నికల వేళ పథకాల పేరుతో మోసం
- ఆదమరిస్తే ఖాతాలు లూటీ



ఖలీల్‌వాడి: ప్రజలను మోసం చేయడానికి సైబర్‌ నేరస్తులు రోజుకో కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో పథకాల పేరుతో ప్రజలకు టోకరా వేయడానికి ప్రయత్నిస్తు న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సోషల్‌ మీడియాలో లిం క్‌లు పంపుతూ నమ్మిస్తున్నారు. ఆ లింక్‌ ఓపెన్‌ చేసి వివరాలు నమోదు చేయగానే బ్యాంక్‌ ఖాతాలో నగదు మాయం చేస్తున్నారు. ఇటీవల డిచ్‌పల్లి మం డలం బర్దిపూర్‌ గ్రామానికి చెందిన ఓ మహిళను ఆరు గ్యారంటీల పేరుతో ఆన్‌లైన్‌ దొంగలు బురిడీ కొట్టించారు. రూ.10 వేలు ఖాతా నుంచి మాయం చేశారు.

సోషల్‌ మీడియాలో ప్రకటనలు

ప్రజలు మోసం చేయడానికి సైబర్‌ నేరగాళ్లు సోషల్‌ మీడియాను ఎంచుకున్నారు. ఫేస్‌బుక్‌, ఎక్స్‌, వాట్సాప్‌లలో లింక్‌లు పెట్టి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఫోన్‌లో ప్రకటనలు టచ్‌ చేయడం తో సైబర్‌ నేరగాళ్లు రూపొందించిన వెబ్‌సైట్‌ ఓపెన్‌ అవుతుంది. అది ప్రభుత్వ వెబ్‌సైట్‌లాగే ఉండటం తో చాలా మంది నమ్మి మోసపోతున్నారు. ఆయా పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి వివ రాలు నమోదు చేయగానే బ్యాంక్‌ అకౌంట్‌ నుంచి డబ్బులు కట్‌ అవుతున్నాయి. దీంతో ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అనవసరమైన లింక్‌లు ఓపెన్‌ చేయొద్దని హెచ్చరి స్తున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి సంబంధిత అధికారు లను సంప్రదించాలని చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చిన లింకులు, ప్రకటనలతో అప్రమత్తంగా ఉండాలి. సైబర్‌ నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే సంబంధిత పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందించాలి. లేదంటే సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేయాలి. 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు పోకుండా చూసే అవకాశం ఉంటుంది. – నరహరి, టౌన్‌ సీఐ, నిజామాబాద్‌

నల్లవెల్లి సొసైటీ ఛైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు

- డీసీవోకు అందించిన తొమ్మిది మంది డైరెక్టర్లు
- క్యాంప్‌నకు తరలిన అసమ్మతి డైరెక్టర్లు



అవిశ్వాస తీర్మానం నోటీసు అందిస్తున్న డైరెక్టర్లు

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం నల్లవెల్లి సొసైటీ ఛైర్మన్‌ సంబరి మోహన్‌పై డైరెక్టర్లు అవి శ్వాస నోటీసు అందజేశారు. తొమ్మిది మంది డైరె క్టర్లు సోమవారం డీసీవో శ్రీనివాసరావుకు నోటీసు అందజేశారు. నల్లవెల్లి గ్రామానికి చెందిన సంబరి మోహన్‌ సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికై అనంతరం ఐడీసీ ఎంఎస్‌ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లకుగాను 9 మంది నాట కీయ పరిణామాల మధ్య అవిశ్వాసానికి మొగ్గు చూపారు. అధికార పక్షానికి చెందిన కొందరు కీలక నేతలు ముందుండి ఈ తతంగాన్ని నడిపించారు. సంబరి మోహన్‌ కాంగ్రెస్‌లో చేరతానన్నా చేర్చుకో కుండా సొసైటీ ఛైర్మన్‌తో పాటు ఐడీసీఎంఎస్‌ ఛైర్మన్‌ పదవి నుంచి తప్పించాలన్న పట్టుదలతో అధికార పక్షం నేతలు ఉన్నట్లు సమాచారం. అవి శ్వాస తీర్మానానికి తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య ఉన్న వైరమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ అనుచరుడైన మోహన్‌కు ఆయన కృషితోనే ఐడీసీఎంఎస్‌ ఛైర్మన్‌ పదవి దక్కింది. అసెంబ్లీ ఎన్నికల్లో బాజిరెడ్డితో పాటు సం బరి మోహన్‌ కూడా భూపతిరెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఆ కారణంతోనే అధికార పక్షం నేతలు మోహన్‌ని పదవి నుంచి తప్పించడానికి యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాస పరీక్షకు డీసీ వో శ్రీనివాసరావు తేది ప్రకటించకపోవడంతో అసమ్మతి డైరెక్టర్లు క్యాంపునకు తరలినట్లు సమాచా రం. అవిశ్వాసం నెగ్గితే నల్లవెల్లి గ్రామానికి చెందిన నోముల శ్రీనివాస్‌రెడ్డి సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రణాళికాబద్ధంగా తాగునీటి సరఫరా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్‌: వేసవి నేపథ్యంలో రానున్న 2 నెలల పాటు ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. సోమవారం ఆమె వీడియో కాన్ఫ రెన్స్‌లో కలెక్టర్లతో సమీక్షించారు. తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేం ద్రాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌ పోస్టులను ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచా లన్నారు. కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు స్పం దిస్తూ యాసంగిలో రైతులు పండించిన ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని సీఎస్‌ దృష్టికి తెచ్చారు. ఇప్పటికే 144 కేంద్రాలను రైతులకు అందుబాటులో తెచ్చామన్నారు. సీఎస్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత పెరు గుతున్న నేపథ్యంలో జిల్లాస్థాయిలో వడ దెబ్బతో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, అద నపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శ్రీవారిని ఊరేగిస్తున్న భక్తులు

మోపాల్‌: అష్ట ఐశ్వర్యాలు పొందాలంటే సూర్యుడిని ఉపాసించాలని, ఆరోగ్యం, పాడి పం టలు బాగుండాలంటే చంద్రుని అనుగ్రహం ఉం డాలని దేవనాథ జీయర్‌ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి అన్నారు. మండలంలోని నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం శ్రీవేంకటేశ్వర స్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం మూడో రోజూ కొనసాగాయి. ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ, గజవాహనంపై శ్రీవారిని ఊరేగించారు. చంద్రప్రభ వాహనంపై స్వామి వారిని ఊరేగించిన తర్వాత ఎదుర్కోలు కార్య క్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయ సింహారెడ్డి, రవి యాదవ్‌, నర్సారెడ్డి, నరాల సుధా కర్‌, ప్రసాద్‌, రాజేశ్వర్‌, రమేష్‌, సాయిలు, భాస్కర్‌, గంగారెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: మహారాష్ట్రలో జరిగిన జాతీయ సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. మార్చి 29 నుంచి ఏప్రిల్‌ 01 వరకు మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌ బాల్‌ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రథమ స్థానం సాధించింది. జట్టులో జిల్లా క్రీడాకారులు కె సోనీ కెప్టెన్‌ (ఏకలవ్య ట్రైబల్‌ పాఠశాల ఇందల్వా యి), ఎం గంగోత్రి, డి లిఖిత, బి నిశిత (సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి), కె సౌజన్య(సాంఘిక సంక్షేమ పాఠశాల ఆర్మూర్‌), కె సంహిత (సాంఘిక సంక్షేమ పాఠశాల ధర్మారం) కీలక పాత్ర పోషించి నట్లు జిల్లా సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగ మోహన్‌ సోమవారం తెలిపారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు

- అర్వింద్‌ గెలుపు కోసం సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి సాయం
- బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌

నిజామాబాద్‌ నాగారం:రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభు త్వం ఎక్కువ రోజులు ఉండదని బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. నగరంలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌ ఆధ్వర్యంలో అర్బన్‌ నియో జకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎంపీ అర్వింద్‌ గెలుపు కోసం కాంగ్రెస్‌ నేత లు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి సపోర్టు చేశారని ఆరో పించారు. ఇప్పుడు అదే పని చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లేసే పరిస్థితి లేదని, బీజేపీకి వేయాల ని సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ఆ రోపించారు. ఎంపీ అర్వింద్‌వి మాటలు తప్ప చేత లు లేవని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిజామాబాద్‌లో జరిగిన అభివృద్ధి ఏమి లేద న్నారు. మాధవనగర్‌ ఆర్‌వోబీకి కేంద్రం రూ.30 కో ట్లు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయిం చిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని, ఏడాదిలోపు కూలిపోతుందన్నా రు. తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని తెలిపారు.

బాజిరెడ్డిని గెలిపించుకుందాం

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతి స్తున్నామని అర్బన్‌ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌ గుప్తా అన్నారు. పార్టీ నుంచి వీడిన వారిని పట్టించు కోవదన్నారు. అందరం కలిసి బాజిరెడ్డిని గెలిపించు కోవాలని కోరారు. జెడ్పీ ఛైర్మన్‌ విఠల్‌రావు, మేయ ర్‌ నీతూకిరణ్‌, సుజిత్‌, సిర్ప రాజు, ఎనుగందుల మురళి, దండు శేఖర్‌, సత్యప్రకాష్‌ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, ప్రధాని మోదీ ఒకటే..

సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని మోదీ ఒకటేనని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి మోదీని బడే బాయి అని పిలవడం వెనుక ఆంతర్యం అదే నన్నారు. బీజేపీ భావజాలం కల్గిన రేవంత్‌రెడ్డి ఆ పార్టీకి మేలు చేయడానికి నిజామాబాద్‌ ఎంపీగా బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టాడని ఆరోపిం చారు. అర్వింద్‌, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి మధ్య మ్యాచ్‌ ఫిక్సింగ్‌ జరిగిందని ఆరోపిం చారు. అందుకే సుదర్శన్‌ రెడ్డి జీవన్‌రెడ్డికి టికెట్‌ ఇప్పించి అర్వింద్‌ను గెలపించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలున నెరవేర్చిన తర్వాతే ఓట్లు అడ గాలని డిమాండ్‌ చేశారు.

క్రైం కార్నర్‌

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మణెమ్మ(ఫైల్‌)

రామారెడ్డి: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన రామారెడ్డిలో సోమవారం చోటు చే సుకుంది. ఎస్సై విజయ్‌ తెలిపిన వివరాలు.. గ్రామా నికి చెందిన దండే బోయిన మణెమ్మ(38) అంగన్‌ వాడీ ఆయాగా పనిచేస్తోంది. ఆమెకు భర్త బైరయ్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆది వారం రాత్రి ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కుంది. బైరయ్య మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని సదరు మహిళతో కలిసి మణెమ్మను హత్య చేశాడని మృతురాలి బంధు వులు ఆరోపించారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ ఇంటిపై దాడికి యత్నించారు. కామారెడ్డి రూరల్‌ సీఐ రామన్‌ ఆధ్వర్యంలో పోలీ సులు వారిని సముదాయించారు. మృతురాలి కూతురు స్వాతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

రెంజల్‌: భర్త కల్లు తాగొద్దన్నందుకు మనస్తాపం చెందిన మహిళ చెరు వులో దూకి ఆత్మహత్య చేసుకుంది. రెంజల్‌ ఎస్సై సాయన్న తెలిపిన వివ రాలు.. రెంజల్‌ గ్రామానికి చెందిన పిల్లి లక్ష్మి(38) వారం రోజులుగా అతిగా కల్లు తాగుతుండటంతో భర్త కంటన్న మందలించాడు. ఈ విష యంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిన లక్ష్మి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం స్థానిక పెద్ద చెరువులో ఆమె మృతదేహం తేలడంతో పోలీసులకు సమా చారం అందించారు. కంటన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

మోర్తాడ్‌: మండలంలోని వడ్యాట్‌ చెరువులో పడి పశువుల కాపరి మల్ల య్య(75) మృతి చెందాడు. స్థానికంగా ఉంటూ పశువులను కాస్తున్న మల్లయ్య ఆదివారం ప్రమాదవశాత్తు చెరువులో పడిపోగా సోమవారం మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌ రెడ్డి తెలిపారు.

ఆలయాల్లో చోరీ

మోర్తాడ్‌: మండలంలోని తిమ్మాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు శ్రీవేంకటేశ్వర ఆలయం, శుక్ర వారం దేవి ఆలయంలో హుండీల తాళాలను పగులగొట్టి నగదును ఎత్తుకవెళ్లారు. సోమవారం రెండు ఆలయాల పూజారులు త లుపులు తెరిచ డానికి ప్రయత్నించగా వాటిని బ ద్దలు కొట్టిన ఆన వాలు కనిపించాయి. వెంటనే గ్రామ పెద్దలకు సమాచారం అందించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

రుద్రూర్‌: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోతంగల్‌ మండల కేంద్రంలో సోమవా రం పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. పోతం గల్‌లో పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీసులు హం గర్గ గ్రామం నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపి విచారించగా అనుమతి పత్రాలు చూపక పోవడం తో కోటగిరి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో నలుగురికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన 11 మందిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా.. జడ్జి సయ్యద్‌ఖదీర్‌ నలుగురికి జైలుశిక్ష, ఏడుగురికి జరిమానా విధించినట్లు తెలిపారు.

సదాశివనగర్‌:డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఒకరికి జైలు శిక్ష విధించినట్లు సోమవారం పోలీస్‌ స్టేష న్‌ అధికారి కాజల్‌ సింగ్‌ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన హైదరాబాద్‌కు చెందిన సయ్యద్‌ సుల్తాన్‌ను కోర్టులో హాజరు పర్చినట్లు ఆయన తెలిపారు. రెం డో తరగతి జ్యుడీషియల్‌ మేజిస్ట్రేట్‌ ప్రతాప్‌ నింది తుడికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.300 జరిమానా విధించినట్లు తెలిపారు.

భూ వివాదంలో ఇరువర్గాల దాడి



చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌

దోమకొండ: భూ వివాదం విషయంలో ఇద్దరు ఒక రిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మండలంలోని అంబారిపేటలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పసుపునూరి శ్రీకాం త్‌, దేవరాజ్‌ అన్నదమ్ముళ్ల కుమారులు. వీరిమధ్య వ్యవసాయ భూమి విషయంలో గొడవలు ఉన్నాయి. తమకు ఆస్తి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న దేవరాజ్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్‌ సోమవారం ఫిర్యాదు చేశాడు. అనంతరం గ్రామానికి వెళ్లి దేవరాజ్‌తో గొడవపడ్డాడు. శ్రీకాంత్‌ రాయితో దేవరాజ్‌పై దాడికి యత్నించగా, శ్రీకాంత్‌ తండ్రి అంజయ్య కర్రతో దాడి చేశారు. దీంతో దేవరాజు అక్కడే ఉన్న బార్బర్‌ షాపులో కత్తెర తీసుకొని శ్రీకాంత్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. కత్తెర దాడిలో గాయపడ్డ శ్రీకాంత్‌ను ఆస్పత్రికి తరలించారు.

బెల్టు దుకాణంపై దాడి



మద్నూర్‌: డోంగ్లీ మండలం మారేపల్లిలో సోమవారం రాత్రి అక్రమంగా మద్యం విక్ర యిస్తున్న బెల్టు దుకాణంపై పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై కదిరే శ్రీకాంత్‌ తెలిపారు. దుకాణంలో రూ.3,500 విలువ గల మద్యం బాటి ళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బాన్సువాడలో బార్‌పై కేసు

బాన్సువాడ: బాన్సువాడలోని ఓ బార్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీపీఈవో రవీందర్‌రాజు తెలిపారు. పట్టణంలోని ఓ బార్‌లో దేశీదారు విక్రయిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసి రిజిస్టర్‌ సరిగ్గా లేనందున కేసు నమోదు చేశామన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల దృ ష్ట్యా సలాబత్‌పూర్‌ వద్ద చెక్‌పోస్ట్‌ ఏర్పాటు చేసి పక్క రాష్ట్రాల నుంచి దేశీదారు మద్యం రాకుండా కట్టడి చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నస్రుల్లాబాద్‌: మండల కేంద్రంలోని కారం గిర్ని వద్ద సోమవారం అర్ధరాత్రి ఐచర్‌ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివ రాలు ఇలా.. నెమ్లి గ్రామానికి చెందిన పోచయ్య (34) వర్నిలోని వైన్స్‌ పర్మిట్‌ రూంలో తన భార్య విజయతో కలిసి పనిచేసేవాడు. గత మూడు రోజులుగా పనికి రావడం లేదని అతని భార్య తెలి పింది. ఈక్రమంలో అతడు రోడ్డుపై నడుస్తూ నసు రుల్లాబాద్‌ వైపు వెళ్తుండగా బాన్సువాడ వైపు వెళు తున్న ఐచర్‌ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి, వివరాలు సేకరించారు. వాహన డ్రైవర్‌ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.